7

సాక్షి విజయనగరం

గురువారం । 25 । మే । 2023



చేపల వేట

వంగర: మండలంలోని రావి చెరువులో బుధవారం చేపలవేటను స్థానికులు ఉత్సాహంగా సాగించారు. చెరువులో నీరు పూర్తిగా తగ్గుముఖం పట్టడంతో గుంపుగా చేపల వేట చేశారు. చేపలు దొరికిన వారు సంతోషపడ్డారు.



వైభవంగా బ్రహ్మోత్సవాలు

గజపతినగరం: వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగాయి. వందలాది మంది భక్తులు స్వామివారికి పూజలు చేశారు. హారతులిచ్చారు.



బహిరంగ వేలం

పాలకొండ రూరల్: ఎస్‌ఈబీ కేసుల్లో పట్టుబడిన 19 వాహనాలకు పాలకొండ ఎస్‌ఈబీ కార్యాలయం వద్ద బుధవారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. రూ.91వేల నగదు సమకూరినట్టు ఎస్‌ఈబీ సీఐ గోపాలకృష్ణ తెలిపారు.

న్యూస్‌రీల్

ఐటీఐలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



ఎం.గోపాలకృష్ణ, జిల్లా కన్వీనర్

విజయనగరం రూరల్: 2023 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ, ప్రైవేటు పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు విజయనగరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ ఎం.గోపాలకృష్ణ బుధవారం తెలిపారు. అభ్యర్థులు ఎన్ని ఐటీఐలకైనా, ఏ జిల్లాలోనైనా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అనంతరం అభ్యర్థి యూనిక్ సంఖ్యతో కూడిన ప్రింట్‌ను తీసుకుని ప్రవేశ సమయంలో అందజేయాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు వచ్చే నెల 6 వరకు ఐటీఐ.ఏపీ.జీవోవి.ఐఎన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అక్రమ తవ్వకాలపై కొరడా



కొండతామరాపల్లిలో తనిఖీలు చేపడుతున్న విజిలెన్స్ అధికారులు

విజయనగరం ఫూల్‌బాగ్: గ్రావెల్ అక్రమ తవ్వకందారులపై మైన్స్ విజిలెన్స్ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. గంట్యాడ మండలం కొండతామరాపల్లిలో పట్టాభూముల్లో అక్రమంగా 56,538 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తవ్వినట్టు మంగళ, బుధవారం జరిపిన తనిఖీల్లో గుర్తించినట్టు జిల్లా విజిలెన్స్ స్క్వాడ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌పీకే మల్లేశ్వరరావు తెలిపారు. పీఎస్‌కే, వ్రిద్ధి ఇన్‌ఫ్రాటెక్‌లిమిటెడ్ హైవే కంపెనీలకు సుమారు రూ.2 కోట్ల అపరాధ రుసుము విధించామని చెప్పారు.

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

విజయనగరం ఫూల్‌బాగ్: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం జరిగిన ఫస్టియర్ తెలుగు, సంస్కృతం, హిందీ పరీక్షలకు 3,796 మందికి 3528 మంది హాజరయ్యారు. 268 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ పరీక్షకు 414 మందికి 85 మంది గైర్హాజరుకాగా, 329 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన సెకిండియర్ పరీక్షకు 1240 మందికి 143 మంది గైర్హాజరు కాగా, 1097 మంది హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 278 మందికి 43 మంది గైర్హాజరు కాగా, 235 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్టు ఆర్ఐఓ మజ్జి ఆదినారాయణ తెలిపారు.

నేడు మెడికల్ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్

విజయనగరం ఫూల్‌బాగ్: ఉమ్మడి విజయనగరం జిల్లాలోని జిల్లా పరిషత్, గవర్నమెంట్ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, స్కూల్‌అసిస్టెంట్లు, ఎస్‌జీటీల మెడికల్ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ గురువారం నిర్వహిస్తామని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి బుధవారం ఒకప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రభుత్వాస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ సమక్షంలో ఉదయం 10 గంటలకు జరిగే ధ్రువపత్రాల నిజనిర్ధారణకు ఆయా కేటగిరీల ఉపాధ్యాయులు హాజరుకావాలని కోరారు.

బాసంగిలో గజరాజులు



బాసంగి అరటితోటలో సంచరిస్తున్న గజరాజుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని బాసంగి గ్రామ పొలాల్లో 8 ఏనుగుల గుంపు బుధవారం సంచరించింది. పంటలు పాడవుతుండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఏనుగులను బీడుభూముల వైపు మళ్లించాలని అటవీశాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

సెంట్రల్ జైలు ఖైదీ మృతి

కాకినాడ క్రైం: రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న రిమాండ్ ఖైదీ అనారోగ్యంతో చికిత్స పొందుతూ కాకినాడ జీజీహెచ్‌లో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. విజయనగరం జిల్లా రాజాం మండలం మెంతిపేట గ్రామానికి చెందిన పడాల హరి (63)కి సివిల్ వివాదంలో జైలు శిక్ష పడగా, ఈ నెల 12వ తేదీన రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తీసుకువచ్చారు. అయితే ఈనెల 15వ తేదీన మధుమేహం, రక్తపోటుతో తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం 17న కాకినాడ జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. కాకినాడ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.



విజయనగరం మండలంలో పనిచేస్తున్న వేతనదారులు

‘ఉపాధి’ కల్పనలో నంబర్ 1

- పనిదినాల కల్పనలో దేశంలోనే ముందంజలో నిలిచిన జిల్లా
- రోజుకు 2.50 లక్షల మంది వేతనదారుల హాజరుతో సరికొత్త రికార్డు
- ఏప్రిల్, మే నెలల్లో 73,28,047 పనిదినాల కల్పన

విజయనగరం ఫోర్ట్:

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమల్లో విజయనగరం జిల్లా సరికొత్త రికార్డును సృష్టించింది. పనిదినాల కల్పనలో విజయనగరం జిల్లా దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచింది. మొన్నటివరకు రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన జిల్లా ఇప్పుడు ఏకంగా దేశంలోనే ముందంజలో నిలిచింది. ఏప్రిల్, మే నెలకు కలిపి 90,03,000 పనిదినాలు కల్పించాల్సి ఉండగా మే 23వ తేదీ నాటికి 73,28,047 పనిదినాలు కల్పించడం ద్వారా ఇచ్చిన లక్ష్యంలో 81.40 శాతం సాధించి దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. శ్రీకాకుళం, ప్రకాశం జిల్లాలు తర్వాత స్థానాల్లో నిలిచాయి. నాల్గవ స్థానంలో రాజస్థాన్‌లోని బన్‌స్వారా జిల్లా, ఐదో స్థానంలో పార్వతీపురం మన్యం జిల్లాలు ఉన్నాయి.

ఎస్సీ, ఎస్టీలకు పనికల్పనలోనూ..

ఉపాధిహామీ పథకం 2005 సంవత్సరంలో ప్రారంభమైనప్పటి నుంచి పనుల కల్పనలో విజయనగరం జిల్లా ముందంజలో కొనసాగుతూ వస్తోంది. జిల్లాలో వలస నివారణకు, సాగునీటి వనరుల అభివృద్ధికి ఈ పథకం ఆలంబనగా నిలిచింది. జిల్లాలో 3,82,000 జాబ్‌కార్డులు ఉన్నాయి. వీటిలో 6,07,000 మంది వేతనదారులు నమోదయ్యారు. ఎస్సీ జాబ్ కార్డులు 44,301, ఎస్టీ జాబ్ కార్డులు 9,937 ఉన్నాయి. వీరికి పనిదినాల కల్పనలోనూ విజయనగరం జిల్లా ప్రథమ స్థానాన్నే నమోదు చేసింది. ఎస్సీ కుటుంబాల్లో 31,724 కుటుంబాలు (71.61) శాతం, ఎస్టీ కుటుంబాల్లో 6,784 (68.2 శాతం) మందికి జిల్లా యంత్రాంగం పనికల్పించింది. గతంలో ఉపాధి పనులకు వచ్చే ఎస్సీ, ఎస్టీల సంఖ్య 20 శాతానికి మించేదికాదు. చాలామంది పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలస పోవడం, భవన నిర్మాణం, ఇటుక బట్టీల పనులకు వెళ్లేవారు. ఉపాధి హామీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఉపాధిహామీ పనులపై అవగాహన కల్పించారు. జాబ్ కార్డులు అందజేశారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా రోజుకు 2.50 లక్షల మంది వేతనదారులు పనికి హాజరవుతున్నారు.

చాలా సంతోషంగా ఉంది



పనిదినాల కల్పనలో దేశంలోనే విజయనగరం జిల్లా ప్రథమ స్థానం సాధించడం సంతోషంగా ఉంది. కలెక్టర్ మార్గనిర్దేశం, ప్రజాప్రతినిధుల తోడ్పాటు, డ్వామా సిబ్బంది కృషితో పాటు ఉపాధి పనుల పట్ల వేతనదారులకు ఉన్న నమ్మకం దీనికి కారణంగా భావిస్తున్నాము. ఇదే స్ఫూర్తితో మరిన్ని లక్ష్యాలు సాధించేందుకు కృషి చేస్తాం.

– జి.ఉమాపరమేశ్వరి, డ్వామా పీడీ

కలెక్టర్ నిరంతర పర్యవేక్షణ

కలెక్టర్ నాగలక్ష్మి ఉపాధిహామీ పనులపై నిరంతర పర్యవేక్షణ జరుపుతున్నారు. మస్టర్లను పరిశీలిస్తున్నారు. పనుల ప్రదేశంలో మౌలిక సదుపాయాలపై ఆరా తీస్తున్నారు. వేతనదారులందరికీ గిట్టుబాటు వేతనం వచ్చేలా కొలతల ప్రకారం పనులు కల్పించాలని టెక్నికల్ అసిస్టెంట్లను ఆదేశిస్తున్నారు. లక్ష్యాల సాధనపై ఉపాధి హామీ సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్నారు. ఆ కృషికి ఫలితం కనిపించడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పనుల కల్పనలో దేశంలోనే జిల్లా ప్రథమస్థానంలో నిలవడంపై వేతనదారులు, ఉపాధిహామీ సిబ్బందిని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.



ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక భరోసా



జగనన్న విద్యాదీవెన నమూనా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ భావన తదితరులు

- చదువుకు ప్రభుత్వం పెద్దపీట
- చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందన్నదే సీఎం ఉద్దేశం
- జగనన్న విద్యాదీవెన నిధులు విడుదల
- జిల్లాలో 41,616 మంది విద్యార్థులకు రూ.31.72 కోట్ల లబ్ధి
- నమూనా చెక్కును అందజేసిన జెడ్పీచైర్మన్, కలెక్టర్

విజయనగరం ఫోర్ట్: పేద విద్యార్థుల చదువుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోంది. చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని, పేద కుటుంబాల ఆర్థిక జీవనం మెరుగుపడుతుందని నమ్ముతోంది. విద్యార్థుల చదువులే పెట్టుబడిగా భావిస్తూ పెద్ద ఎత్తున ఆర్థిక సాయం అందజేస్తోంది. ఇందులో భాగంగా నే కళాశాలల్లో చదువుతున్న అర్హత ఉన్న విద్యార్థికి పూర్తి ఫీజును ప్రభుత్వమే భరించేలా జగనన్న విద్యాదీవెన పథకాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్. గన్‌మోహన్ రెడ్డి అందుబాటులోకి తెచ్చారు. జనవరి– మార్చి 2023 త్రైమాసికానికి సంబంధించిన నిధులను తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు నుంచి బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి బుధవారం జమచేశారు. కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్‌లో విజయనగరం కలెక్టరేట్ నుంచి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస్‌రావు, కలెక్టర్ నాగలక్ష్మి, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన తిలకించారు. విద్యాదీవెన నమూనా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ప్రతి పేద విద్యార్థి చదువుకోవాలన్నదే సీఎం లక్ష్యమన్నారు. రాష్ట్రాన్ని విద్యా ఆంధ్రప్రదేశ్‌గా మార్చడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారన్నారు. చక్కగా చదువుకుని ప్రభుత్వ ఆశయంతో పాటు తల్లిదండ్రుల కలలను విద్యార్థులు నెరవేర్చాలని సూచించారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ జగనన్న విద్యాదీవెన పథకం కింద జిల్లాలోని 41,616 మంది విద్యార్థులకు రూ.31.72 కోట్ల ఆర్థిక ప్రయోజనం కలిగినట్టు వెల్లడించారు. పేద విద్యార్థుల చదువుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డీడీ రత్నం, మైనార్టీ సంక్షేమ అధికారి లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరీ చేయిస్తే కఠిన చర్యలు

- సీనియర్ సివిల్ జడ్జి కె.నాగమణి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కె.నాగమణి

విజయనగరం క్రైమ్: బాల, బాలికలతో వెట్టిచాకిరీ చేయిస్తే చట్ట ప్రకారం కఠినంగా శిక్షిస్తామని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.నాగమణి పేర్కొన్నారు. విజయనగరం చెంచుల కాలనీలో అంతర్జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవం సందర్భంగా బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మానవ అక్రమ రవాణా నేరమని, పిల్లలను ఒకచోటు నుంచి వేరే ప్రాంతానికి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, వెట్టిచాకిరీ పనులకు తరలించరాదన్నారు. తహసీల్దార్ సీహెచ్ బంగార్రాజు మాట్లాడుతూ బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, పెద్దలు పనికి పోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకుని చిన్నారులను విద్యావంతులుగా తీర్చిదిద్దాలని కోరారు. వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు మాట్లాడుతూ పొరపాటున తల్లిదండ్రుల నుంచి తప్పిపోయిన బాలబాలికలను గుర్తించి కౌన్సెలింగ్ ద్వారా వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చుతున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ కె.వాసుదేవరావు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ జి.హిమబిందు, అయ్యన్నపేట కార్పొరేటర్ సైలాడ సత్యనారాయణ, ఏసీఎల్ శ్రీనివాసులు, రమాదేవి, శ్రీనివాసరావు, చంద్రశేఖర్, తాడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

అరకు-విశాఖ రోడ్డు నిర్మాణ స్థలం పరిశీలన

కొత్తవలస: అరకు-విశాఖ జాతీయ రహదారి (516–బి) రోడ్డు నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఆర్డీఓ ఎం.సూర్యకళ నేషనల్ హైవే అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. కొత్తవలస మండలం చింతలపాలెం, వీరభద్రపురం గ్రామాల్లో పర్యటించారు. వీరభద్రపురం గ్రామం మీదుగా ఇప్పటికే సుజలస్రవంతి పోలవరం ఎడమ కాలువ, రాయపూర్ గ్రీన్‌ఫీల్డు హైవే, రైల్వేలైన్, ఐఓసీఎల్ పైప్‌లైన్ తదితర ప్రాజెక్టులన్నీ వెళ్తున్నాయని, 90 శాతానికి పైగా సాగుభూమి కోల్పోయామని, ఇప్పుడు ఈ హైవే వస్తే పూర్తిగా భూములు కోల్పోవాల్సి వస్తుందని గ్రామ రైతులు వాపోయారు. దీనిపై ఆర్డీఓ స్పందిస్తూ పరిహారంపెంచి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

షూటింగ్ సందడి



రింగ్‌రోడ్డులోని ఓ షాప్‌లో సినిమా చిత్రీకరణలో పాల్గొన్న హీరో సంపూర్ణేష్‌బాబు, హీరోయిన్ అంతర

విజయనగరం టౌన్: రాజ్‌కుమార్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న కొత్త చిత్రంలోని పలు సన్నివేశాలను విజయనగరం జిల్లా కేంద్రంలోని రింగ్‌రోడ్డు లీపారడైజ్, పెద్దచెరువు గట్టు సమీపంలోని ఆస్పత్రి ఆవరణలో బుధవారం చిత్రీకరించారు. సినిమాలో సంపూర్ణేష్‌బాబు హీరోగా, అంతర స్వర్ణక హీరోయిన్‌గా నటిస్తున్నట్టు నిర్మాత రాజ్‌కుమార్ చందక తెలిపారు. ఓ తల్లికి జరిగిన అన్యాయం రూపొందుతున్న చిత్రం షూటింగ్ మరో రెండు రోజుల్లో పూర్తవుతుందన్నారు. ఉత్తరాంధ్రాలో లొకేషన్‌లు బాగా ఉండడంతో చిత్రపరిశ్రమ ఇటువైపు మొగ్గుచూపుతోందన్నారు. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు శ్రీనివాస్, వెంకట్‌లు నిర్వర్తిస్తున్నారన్నారు. చిత్రంలో అమిత్ తివారీ, రాజీవ్ కనకాల తదితరులు నటిస్తున్నారని తెలిపారు.

గిరిజనం ఇంట పైనాపిల్ పంట

- మన్యంలో ఆరంభమైన పైనాపిల్ సీజన్
- ఏటా 20 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి
- 5 వేల ఎకరాల్లో పంట సాగు
- ప్రస్తుతం పండు ధర రూ.15 నుంచి రూ.20
- గిరిజన రైతుల ప్రధాన ఆదాయవనరు ఇదే



వ్యాపారులు కొనుగోలు చేసి పోగువేసిన పైనాపిల్



సీతంపేట సంతలో పైనాపిల్ క్రయవిక్రయాలు

సీతంపేట: గిరిజన రైతుల ప్రధాన ఆదాయవనరైన పైనాపిల్ సీజన్ ఆరంభమైంది. సీతంపేట మన్యంలో ఈ నెల నుంచి ఆగస్టు వరకు పంట సీజన్ కొనసాగుతుంది. సుమారు 5 వేల ఎకరాల్లో పంట విస్తరించి ఉంది. దాదాపు 20వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని రైతులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఒక్కో పండు ధర రూ.15 నుంచి రూ.20 మధ్య పలుకుతోంది. గిరిజనులు వారపు సంతల్లో పంటను విక్రయిస్తున్నారు. గత ఏడాది కూడా పంట ఆరంభంలో ఉన్న ధర ఆఖరులోలేదని, పండు ధర రూ.5కు పడిపోయిందని రైతులు చెబుతున్నారు. అప్పట్లో ఐటీడీఏ చొరవతో గిరిజనుల వద్ద నుంచి రూ.12 నుంచి రూ.15 వరకు కొనుగోలు చేసి బయట మార్కెట్లో విక్రయించారు. ఏజెన్సీలో కేరళ రాష్ట్రానికి చెందిన క్యూ రకం పైనాపిల్ సాగులో ఉంది. మన్యంలో సేంద్రియ ఎరువులతో పండించిన పైనాపిల్ రుచి, శుచిలో మేటిగా ఉండడంతో మైదాన ప్రాంతాల్లో గిరాకీ ఉంటుంది. ఇక్కడ కొనుగోలు చేసిన పంటను కోనసీమ, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్, విశాఖపట్నం, గుంటూరు, పల్నాడు, ఏలూరు, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు వ్యాపారులు తరలిస్తున్నారు.

గజేంద్రులకు పిండప్రదానం

- అడవి జీవులతో అనుబంధం చాటుకున్న గిరిజనులు
- పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలంలో ఘటన



ఏనుగులు పాతిపెట్టిన స్థలంలో పూజలు చేస్తున్న ఎంపీపీ శాంతికుమారి, తోట సింహాచలం, గిరిజనులు

భామిని: పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలంలోని పక్కుడుబద్ర–కాట్రగడ–బి గ్రామాల మధ్య పంట పొలాల్లో ఈ నెల 11న విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన నాలుగు ఏనుగులకు సంప్రదాయబద్ధంగా పిండ ప్రదానం చేసి తమ అనుబంధం చాటుకున్నారు గిరిజనులు. ఏనుగులను మరణించిన చోటే రైతు అనుమతితో అటవీ అధికారులు పాతిపెట్టారు. ఆ ప్రదేశంలో పక్కుడుభద్ర తోటల యజమాని, భామిని ఎంపీపీ తోట శాంతికుమారి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం ఆధ్వర్యంలో పక్కుడుభద్ర, బొమ్మిక, పిల్లిగూడకు చెందిన గిరిజనులు సంప్రదాయబద్ధంగా పూజలు చేసి వంశధార నదిలో పిండ ప్రదానం చేశారు. అనంతరం ఏనుగులు తిరుగాడిన తోటల్లో అన్నదానం నిర్వహించారు.

నమ్మించి..గొంతునులిమి..

- స్నేహితురాలే హంతకురాలు!
- ప్రియుడితో కలిసి హతమార్చిన వైనం
- కళ్లేపల్లి బుక్‌కీపర్ మహేశ్వరి హత్య కేసును ఛేదించిన పోలీసులు
- ఆర్థిక లావాదేవీలే హత్యకు కారణం
- ముగ్గురు నిందితులను అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచిన పోలీసులు

లక్కవరపుకోట:



హత్యకు గురైన గోకేడ మహేశ్వరి (ఫైల్)

వారిద్దరూ మంచి స్నేహితులు. ఒకే గ్రామం, ఒకే విధులు కావడంతో ఎక్కడికి వెళ్లినా కలిసే వెళ్లేవారు. వారి మధ్యతలెత్తిన ఆర్థిక విబేధాలతో స్నేహితురాలే నమ్మించి పథకం ప్రకారం తన ప్రియుడితో కలిసి స్నేహితురాలిని హతమార్చింది. ఎల్.కోట మండలం కళ్లేపల్లి గ్రామానికి చెందిన గోకేడ మహేశ్వరి హత్యకేసును పోలీస్‌లు ఛేదించారు. నిందితులను కొత్తవలస కోర్టులో హాజరుపరచడంతో రిమాండ్ విధించారు. ఎల్.కోట పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు వెల్లడించారు. కళ్లేపల్లి గ్రామానికి చెందిన గోకేడ మహేశ్వరి, గాడి చిన్నతల్లిలు వైఎస్సార్ క్రాంతి పథంలో బుక్ కీపర్లుగా పనిచేస్తున్నారు. ఒకే ఉద్యోగం కావడంతో ఇరువురి మధ్య ఆర్థిక లావాదేవీలు సాగాయి. ఈ క్రమంలో నిందితురాలు గాడి చిన్నతల్లి స్త్రీనిధి రుణాల్లోని కొంత సొమ్మును తన వ్యక్తిగత అవసరాలకు వాడుకుంది. రుణం డబ్బులు బ్యాంకుకు కట్టే సమయంలో తన స్నేహితురాలు మహేశ్వరి వద్ద అప్పుగా తీసుకొని అప్పుడప్పుడు బ్యాంకులో జమ చేసేది. తర్వాత కాలంలో మహిళా మండలి సభ్యుల నిధులను వీరిద్దరూ వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నారు. ఎన్నాళ్లు ఇలా చేస్తాం... నీవు వాడుకున్న డబ్బులు, నా దగ్గర అప్పుగా తీసుకున్న డబ్బులు తీసుకురా.. నేను వాడుకున్న డబ్బులను తీసుకొచ్చి పూర్తి స్థాయిలో బ్యాంకు రుణాలను చెల్లించి హాయిగా ఉందామని చిన్నతల్లికి మృతురాలు మహేశ్వరి సూచించింది. దీంతో మహేశ్వరిని చంపేస్తే అప్పుగా తీసుకున్న డబ్బులతో పాటు స్త్రీనిధి రుణాలు కట్టాల్సిన అవసరం లేదని చిన్నతల్లి హత్య పథకం రచించింది. రేగ గ్రామానికి చెందిన తన ప్రియుడు డెంకాడ వాసుకు పథకాన్ని వివరించింది. ఇద్దరూ కలిసి ఈ నెల 17వ తేదీన మహేశ్వరిని కారులో ఎక్కించుకుని విజయనగరం మహిళా ప్రాంగణంలో సమావేశానికి బయలుదేరారు. జామి మండలం అలమండ సంత సమీపంలో టిఫిన్ చేశారు. అక్కడ నుంచి భీమసింగి బ్రిడ్జి కిందకు కారును తీసుకెళ్లి ఆపారు. అక్కడ కారు వెనుక సీటులో కూర్చున్న మహేశ్వరితో మాటలు కలిపి ఆమె చున్నీనే పీకకు బిగించి కారులోనే హతమార్చారు. అక్కడ నుంచి నిందితురాలు చిన్నతల్లి ఏమీ తెలియనట్టుగా విజయనగరం సమావేశానికి వెళ్లిపోగా, మృతదేహాన్ని కారులో జమ్మాదేవిపేట గ్రామం సమీపంలోని సరస్వతీ లేవుట్ వద్ద గల నిర్మానుష్య ప్రాంతం వద్ద పడేసి డెంకాడ వాసు తన ఇంటికి వెళ్లిపోయాడు. మృతదేహం 18వ తేదీన ఉదయం వెలుగు చూసింది. పోలీసులు అన్నికోణాల్లో దర్యాప్తును ముమ్మరం చేశారు. ఫోన్ లోకేషన్స్, చిన్నతల్లి నడవడికపై నిఘా పెట్టగా చిన్నతల్లి, ఆమె ప్రియుడు డెంకాడ వాసు, మరో ప్రియుడు కోరాడ సాయికుమార్‌తో కలిసి పారిపోయేందుకు సిద్ధమైన సమయంలో లక్కవరపుకోట మండలం గంగుబూడి కూడలి వద్ద పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారణ చేయగా నేరాన్ని అంగీకరించారని, కోర్టు రిమాండ్ విధించినట్టు డీఎస్పీ తెలిపారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గోవిందరావు, వెనుకన ముసుగులో నిందితులు

దృశ్యం సినిమాను తలపించిన కేసు..

మహేశ్వరి హత్యకేసును దర్యాప్తు చేసిన పోలీసులకు దృశ్యం సినిమా తలపించింది. నిందితురాలు గాడి చిన్నతల్లి తన స్నేహితురాలు మహేశ్వరి ఫోన్‌ను మాయం చేయడంతో పాటు లోకేషన్ దొరకుండా జాగ్రత్తలు పడింది. తన ప్రియుడు డెంకాడ వాసుతో కలిసి హత్యచేసి, మరో ప్రియుడు, కళ్లేపల్లికి చెందిన సాయికుమార్‌తో కలిసి పరారయ్యేందుకు ప్రయత్నించింది. ఆమెతో పాటు ఇద్దరు ప్రియుల ఫోన్‌లను వారివారి ఇళ్ల వద్దనే ఉంచేసి.. ఎవరికి ఎవరూ ఫోన్‌లు చేయకుండా గడిపారు. ఎప్పటివలే విజయనగరం సమావేశానికి చిన్నతల్లి హాజరుకావడం అంతా డ్రామాను తలపించింది. పోలీసులు సవాల్‌గా తీసుకుని కేసును దర్యాప్తు చేయడంతో నిందితులు పట్టుబడ్డారు. కేసు ఛేదనలో ప్రతిభ కనబర్చిన ఎల్.కోట, వేపాడ ఎస్ఐలు ముకుందరావు, రాజేష్, కానిస్టేబుల్స్ ఎం.రమేష్, పోతురాజు, గౌరినాయుడులను డీఎస్పీ గోవిందరావు, సీఐ ఎస్.సింహాద్రినాయుడు అభినందించారు.

గిరిజన విద్యార్థి ఆత్మహత్య

పాచిపెంట: అగ్రికల్చర్ డిప్లమోలో ఫెయిల్ అవడంతో తల్లిదండ్రులు మందలిస్తారన్న భయంతో పురుగుమందు తాగి గిరిజన విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని అమ్మ వలసలో జరిగిన ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన జట్ల హేమంత్ కుమార్ నెలిపర్తిలో అగ్రికల్చర్ డిప్లమో ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు, ప్రథమ సంవత్సరం పరీక్షల్లో ఫెయిల్ అవడంతో తల్లిదండ్రులు మందలిస్తారని భయాందోళన చెంది మంగళవారం 11 గంటల సమయంలో ఊరు బయట ఉన్న చెరువు వద్దకు వెళ్లి పురుగుమందు తాగేశాడు. బయటికి వెళ్లిన తన అన్న ఇంకా ఇంటికి రాలేదని తమ్ముడు హేమకుమార్ చెరువు వద్దకు వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో ఉన్న అన్నను చూసి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చాడు, వెంటనే సాలూరు సీహెచ్‌సీకి తీసుకువెళ్లగా ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం నిమిత్తం విజయనగరం కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మరణించాడు. మృతుడి తండ్రి జట్ల రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటరమణ పేర్కొన్నారు.



హేమంత్ కుమార్ మృతదేహం

వేధింపులు తాళలేక బాలిక..

కొత్తవలస: మండలంలోని ముసిరాం గ్రామానికి చెందిన బాలికను ఆదే గ్రామానికి చెందిన మాకిరెడ్డి గాడేలు ప్రేమ పేరుతో వేధిస్తుండడంతో బాలిక తాళలేక బుధవారం పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు ఎస్ఐ బొడ్డు దేవి మాట్లాడుతూ పురుగు మందుతాగి ఆపస్మాక స్థితిలో ఉన్న బాలికను హుటాహుటిన విశాఖ కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చెప్పారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు శవ పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగు మందు తాగి మహిళ..

భోగాపురం: మండలంలోని బోడిసింగిపేట గ్రామానికి చెందిన కారి అప్పయ్యమ్మ(56) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కొంత కాలంగా శ్వాసకోస సమస్య ఎదుర్కొంటున్న ఆమెకు భర్త సత్తెయ్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ సంపాదన అంతా తన మందులకే వస్తున్నాయని ఆర్థికంగా కష్టమవుతోందని మనస్తాపం చెందిన ఆమె మంగళవారం ఉదయం పురుగు మందు తాగి ఆపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. దీంతో కుమారులు తల్లిని విజయనగరం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందింది. భర్త సత్తెయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

బొండపల్లి: మండలంలోని ముద్దూరు గ్రామంలో ఒక ఇంట్లో గృహ నిర్మాణ పనులు చేస్తుండగా ఓ వ్యక్తి విద్యుత్ షాక్ తగిలి మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై ఎస్.రవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ముద్దూరు గ్రామంలో ఒక ఇంట్లో విద్యుత్ పనులు చేస్తూ గజపతినగరం మండలంలోని పురిటిపెంట గ్రామానికి చెందిన కలిశెట్టి కొండబాబు(35) మృతి చెందాడు. కొండబాబు విద్యుత్ పనులు చేస్తుండగా ఒక్కసారిగా షాక్‌కు గురి కావడంతో గజపతినగరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స చేస్తుండగా మృతిచెందాడు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించిన అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన కొండబాబు

మిల్లు ఆపరేటర్..

రాజాం సిటీ: మండల పరిధి ఒమ్మి పంచాయతీ నర్సింహపురంలోని జయలక్ష్మి మోడరన్ రైస్ మిల్లు పక్కన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై మిల్లు ఆపరేటర్ మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై వీబీ రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక నవ్యనగర్‌లో నివాసం ఉంటున్న గుమ్మలక్ష్మీపురం మండలం పెద్దలేవిడి గ్రామానికి చెందిన కొండగొర్రి వెంకటరావు (55) రైస్ మిల్లులో ఆపరేటర్‌గా పనిచేస్తున్నడు. బుధవారం యథావిధిగా విధులకు హాజరయ్యాడు. మిల్లుకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సమస్య ఉందని తెలుసుకుని అక్కడికి వెళ్లి చూశాడు. అక్కడ విద్యుత్ సరఫరా ఉన్న ఎంసీబీకి తగలడంతో షాక్ కొట్టి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మిల్లు యజమాని బూరాడ విజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించామన్నారు. మృతునికి భార్య జయలక్ష్మితో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.



విద్యుదాఘాతంతో మృతిచెందిన వెంకటరావు

మామిడి తోటలో వ్యక్తి..

భోగాపురం: మండలం కేంద్రం భోగాపురం నుంచి అక్కివరం వెళ్లే దారిలో ఉన్న మామిడి తోటలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డెంకాడ మండలం అక్కివరం గ్రామానికి చెందిన పెంటబోయిన ఆదినారాయణ(47)మామిడి తోటలో ఉన్న కాయలను దింపేందుకు వెళ్లి చెట్టుకొమ్మ విరిగి పడిపోయి మృతిచెందినట్లు భావిస్తున్నారు. అయితే తోటకాపరి గిన్నె సత్యం, ఆదినారాయణ రెండేళ్లుగా మంచి స్నేహితులు. ఆదినారాయణ తన పశువులను ఇక్కడే మేపుతుంటాడు. ఈ క్రమంలో కాపరి సత్యం మాట్లాడుతూ తాను ఆ సమయంలో లేనని తోటలో కాయల్ని తీసుకెళ్లాలని ఆదినారాయణ మృతి విషయాన్ని తోట గుమస్తా జగదీష్‌కు తెలియజేయగా మృతుని కుటుంబసభ్యులకు సమాచారం అందించారని తెలిపాడు. ఈ సమాచారం మేరకు కుటుంబ సభ్యులు వచ్చి ఆదినారాయణను స్థానిక సుందరపేట ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇదిలా ఉండగా తన తండ్రి మృతిపై అనుమానం ఉందని, కేవలం చెట్టుపై నుంచి పడిపోవడం కాదని, కావాలనే తన తండ్రిని హత్యచేసి ఉంటారంటూ మృతుడి కుమారుడు రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాపు చేస్తున్నామని ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

GOVERNMENT OF ANDHRA PRADESH DEPARTMENT OF MEDICAL EDUCATION

Tender Notification Rc.No.21/G1/VZM/2023, Dated: 24.05.2023

TENDER NOTICE

Sealed Tenders are invited from reputed manufacturers, Distributors for supply of Lab & Diagnostic items, Drugs & Medicines, Surgical consumables, Ortho Implants, Stationery items to Government General Hospital, Vizianagaram, On payment of Rs.500/- by way of D.D from any Nationalized Bank drawn in favour of the Superintendent, GGH & Member Convener, HDS, Government General Hospital, Vizianagaram, the tender schedule with specifications and Terms and conditions will be available from: 24.05.2023 to 08.06.2023 during office working days from 11.00 AM to 4.00 PM.

Sd/- **Superintendent**
Hospital Development Society
Govt. General Hospital, Vizianagaram

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి

ప్రాంతీయ కార్యాలయం, డోర్ నెం.8-30-19, సాయినగర్, తోటపాలెం, విజయనగరం జిల్లా - 535 002

ప్రజాభిప్రాయ సేకరణ

భారత ప్రభుత్వ పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వశాఖ పర్యావరణ చట్టం 1986 క్రింద విడుదల చేసిన ఇ.ఐ.ఎ. నోటిఫికేషన్ ఎస్.ఒ.నెం.1533, తే.14-09-2006 ది మరియు తదుపరి సర్క్యులర్స్ ప్రకారం మెస్సర్స్ వజ్రకాయ క్రషర్స్ ప్రైవేట్ లిమిటెడ్, (రోడ్ మెటల్ మరియు బిల్డింగ్ స్టోన్) (7.6 హెక్టార్లు) వారు రూ. 20.0 లక్షలతో సాలీన రోడ్ మెటల్ మరియు బిల్డింగ్ స్టోన్ - 3,18,792 క్యూబిక్ మీటర్లు త్రవ్వుటకు ప్రతిపాదించిన ప్రాజెక్టును 7.6 హెక్టార్లులో సర్వే నెం. 07, పెదదుంగాడ (గ్రామం), వీలుపర్తి (పంచాయతీ), వేపాడ మండలం, విజయనగరం జిల్లాలో ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు నిర్వహించుట గురించి ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, విజయనగరం జిల్లా వారు జారీచేయు ప్రకటన.

ప్రాజెక్టు వివరములు క్రింది విధంగా ఉన్నవి :

1.	సంస్థ పేరు మరియు చిరునామా	మెస్సర్స్ వజ్రకాయ క్రషర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (రోడ్ మెటల్ మరియు బిల్డింగ్ స్టోన్) (7.6 హెక్టార్లు) సర్వే నెం. 07, పెదదుంగాడ (గ్రామం), వీలుపర్తి (పంచాయతీ), వేపాడ మండలం, విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్.
2.	ప్రాజెక్టు స్థలం	సర్వే నెం. 07, పెదదుంగాడ (గ్రామం), వీలుపర్తి (పంచాయతీ), వేపాడ మండలం, విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్.
3.	అధీకృత వ్యక్తి పేరు, చిరునామా మరియు చరవాణి సంఖ్య	శ్రీ శ్రీచరణ్, మేనేజింగ్ డైరెక్టర్, డోర్ నెం. 8-2457, బ్రహ్మయ్య టెంపుల్ దగ్గర, సత్తూర్ రోడ్, కళ్యాణదుర్గం, అనంతపురం జిల్లా, ఆంధ్రప్రదేశ్- 515761. ఫోన్ నెం. 6362508296, E-mail: raghunsp99@gmail.com
4.	ప్రాజెక్టు విలువ	రూ. 20 లక్షలు
5.	ఉత్పత్తి వివరములు	సాలీన రోడ్ మెటల్ మరియు బిల్డింగ్ స్టోన్ - 3,18,792 క్యూబిక్ మీటర్లు
6.	తేది, సమయం మరియు జరుగుస్థలం	**తేది: 30-06-2023 (శుక్రవారం), సమయం - ఉదయం 10.30 గం॥లకు. స్థలం: కొలికిపాలెం (గ్రామం) దగ్గర.**

7. ప్రాజెక్టు కార్యనిర్వాహక సమాచారం, ప్రాజెక్టు పర్యావరణ ప్రభావ అంచనా మరియు కార్యాచరణ ప్రణాళిక నివేదిక మరియు (సాఫ్ట్ కాపీలు) ప్రజలు చూచుటకు అందుబాటులో ఉంచబడిన ప్రదేశములు: 1) జిల్లా కలెక్టరు వారి కార్యాలయం, విజయనగరం. 2) జిల్లా రెవెన్యూ ఆఫీసర్ వారి కార్యాలయం, విజయనగరం. 3) జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయం, విజయనగరం. 4) ముఖ్య కార్యనిర్వాహణాధికారి వారి కార్యాలయం, జిల్లా పరిషత్, విజయనగరం. 5) జిల్లా పరిశ్రమల శాఖ, ఇండస్ట్రీయల్ ఎస్టేట్, విజయనగరం. 6) సభ్యకార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణ భవన్, ఏపీఐఐసీ కాలనీ రోడ్, గురునానక్ కాలనీ, ఆటో నగర్, విజయవాడ- 520007. 7) జోనల్ కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ఉడా లేఅవుట్, మాధవధార, విశాఖపట్నం. 8) డిప్యూటీ డైరెక్టర్ (యస్), పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వ శాఖ కార్యాలయం మరియు క్లైమేట్ ఛేంజ్, భారత ప్రభుత్వం, సమీకృత ప్రాంతీయ కార్యాలయం, గ్రీన్ హౌస్ కాంప్లెక్స్, గోపాలరెడ్డి రోడ్, విజయవాడ-520010, ఆంధ్రప్రదేశ్. 9) స్టేట్ లెవల్ ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ అథారిటీ (ఎస్.ఇ.ఐ.ఎ.ఎ.) వారి కార్యాలయం, డోర్ నెం. 33-26-14డి/2, సన్‌రైజ్ హాస్పిటల్ దరి, పుష్ప హోటల్ సెంటర్, చలమవారివీధి, కస్తూరిభాయి పేట, విజయవాడ -520010. 10) జిల్లా గనులు మరియు భూగర్భశాఖ ఆఫీసర్ వారి కార్యాలయం, విజయనగరం. 11) తహశీల్దార్ కార్యాలయం, వేపాడ మండలం, విజయనగరం. 12) గ్రామ పంచాయితీ కార్యాలయం, పెదదుంగాడ (గ్రామం), వీలుపర్తి (పంచాయతీ), వేపాడ మండలం, విజయనగరం. 13) ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, డోర్‌నెం. 8-30-19, సాయినగర్, తోటపాలెం, విజయనగరం జిల్లా.

పై తెలియజేసిన ప్రాజెక్టుకు సంబంధించి ఏమైనా సూచనలు, సలహాలు, అభిప్రాయాలు మరియు అభ్యంతరములు ఉన్న యెడల **తే: 30.06.2023** దిన గాని, దానికి ముందుగా గాని ఈ క్రింది సంతకము చేసిన అధికారి వారికి లిఖిత పూర్వకముగా పంపించవచ్చును. మరియు పైన సూచించిన తేది మరియు ప్రదేశము వద్ద ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులో పాల్గొని గానీ తెలియజేయవచ్చు.

సం/- (పర్యావరణ ఇంజనీర్)
ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి,
ప్రాంతీయ కార్యాలయం, విజయనగరం.

స్థలం : విజయనగరం.
తేది : 25-05-2023

పెదరావుపల్లిలో సర్వే

కొత్తవలస: మండలంలోని పెదరావుపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో గల సుమారు 197 ఎకరాల భూమితో పాటూ గ్రామకంఠం కూడా సర్వే రికార్డుల్లో నమోదు కాలేదు. దీంతో మా గ్రామం విజయనగరం జిల్లాలోనూ లేదు. విశాఖపట్నం జిల్లాలోనూ చూపించలేదని చెబుతూ గ్రామస్తులు విశాఖపట్నం జిల్లా కేంద్రంలో జరిగిన కలెక్టర్ గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండల సర్వేయర్ వడ్డి లీల పెదరావుపల్లి గ్రామంలో తన బృందంతో బుధవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెదరావుపల్లి గ్రామం విశాఖ, విజయగనరం జిల్లాల మధ్యలో ఉంది. ఈ గ్రామానికి చెందిన 197 ఎకరాల భూమితో పాటు 8 ఎకరాల్లో గల గ్రామకంఠాన్ని విశాఖ జిల్లా కొవ్వాడ గ్రామరెవెన్యూ పరిధిలో సర్వేనంబర్-1లో కొండపోరంబోకు భూమిగా రికార్డుల్లో నమోదై ఉన్నట్లు తెలిపారు. వాస్తవానికి ఈ భూమి పెదరావుపల్లి గ్రామానికి చెందిన రైతుల జిరాయితీ భూమి. ప్రస్తుతం ఆ భూముల్లో ఎన్నో సంవత్సరాలుగా వ్యవసాయం చేసుకుంటున్నారు. ఇక్కడి వాస్తవ పరిస్థితులను జిల్లా అధికారులకు నివేదిస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో కొవ్వాడ వీఆర్‌ఓ కనకమహాలక్ష్మి, కొవ్వాడ, పెదరావుపల్లి సచివాలయాల సర్వేయర్లు డి.సహిని, కె.కోటేశ్వరరావు, పెదరావుపల్లి ఎంపీటీసీ పరదేశినాయుడు, గ్రామపెద్దలు పెంట అప్పారావు, సర్పంచ్ పీతల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పెదరావుపల్లిలో సర్వే నిర్వహిస్తున్న విశాఖ జిల్లా సర్వే బృందం

చెట్టుకొమ్మ తలపై పడి వ్యక్తి తలకు గాయం

వేపాడ: మండలకేంద్రం వేపాడకు చెందిన ఈగల అప్పారావుపై చెట్టు కొమ్మ విరిగి తలపై పడిపోవడంతో తలకు గాయమైంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం సాయంత్రం మేకలను మేపుకుని ఇంటికి వస్తున్న సమయంలో వీచిన ఈదురు గాలులకు వల్లంపూడి సమీపంలో కళ్లాల వద్ద చెట్టు కొమ్మ విరిగి అప్పారావు తలపై పడిపోవడంతో కుడిపక్క గాయమైంది. దీంతో అప్పారావు గ్రామంలోకి చేరుకోగానే కుటుంబసభ్యులు 108లో ఎస్.కోట ఆస్పత్రికి హుటాహుటిన తరలించారు. మార్గంలోనే 108 ఈఎంటీ టీపీవీ రమణనాయుడు తలకు రక్తస్రావం అవకుండా కట్టువేసి సెలైన్ బాటిల్ పెట్టి ఎస్.కోట ఆస్పత్రికి తరలించారు.

బస్సు టైర్లు ఎక్కి ప్రయాణికురాలికి..

సాలూరు: ప్రయాణికురాలి కాళ్ల మీద నుంచి బస్సు టైర్లు ఎక్కడంతో తీవ్ర గాయాల పాలైంది. ఈ మేరకు పట్టణ ఎస్సై నారాయణ తెలిపిన వివరాలు ప్రకారం, పాచిపెంట మండలం పాంచాలి గ్రామానికి చెందిన కె.చిన్నతల్లి బుధవారం పట్టణంలోని మెయిన్‌రోడ్డులో గల బస్టాండ్ వద్ద పార్వతీపురం బస్సు ఎక్కుతుండగా, డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఆమె కింద పడిపోయింది. దీంతో ఆమె రెండు కాళ్ల మీదకు బస్సు వెనుక టైర్లు ఎక్కడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆమెను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.



ప్రమాదస్థలం వద్ద ఉన్న క్షతగాత్రురాలు

ట్రాక్టర్, ఆటో ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలు

జామి: ట్రాక్టర్, ఆటో ఢీకొన్న ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జామి మండలం చింతాడ గ్రామానికి చెందిన దేగల పైడిరాజు, కుమార్తె అనూరాధ, కుమారుడు శ్యాం అన్నంరాజుపేట పండగకు వెళ్లి బుధవారం రాత్రి తిరిగి స్వగ్రామం చింతాడకు ఆటోలో వస్తుండగా జాగరం నుంచి జామి వెళ్తున్న ట్రాక్టర్ జాగరం గ్రామం వద్ద ఆటోను ఢీకొంది. దీంతో ప్రమాదంలో ముగ్గురికీ తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



గాయాల పాలైన పైడిరాజు, అనురాధ, శ్యాం

బస్సులో బంగారం గొలుసు చోరీ

రణస్థలం: విజయనగరం నుంచి శ్రీకాకుళం వస్తున్న ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళ మెడలో మూడు తులాల బంగారం గొలుసు చోరీకి గురైనట్లు ఫిర్యాదు అందిందని జె.ఆర్.పురం పోలీసులు తెలిపారు. ఎచ్చెర్ల మండలం ఇబ్రహీంబాద్ గ్రామానికి చెందిన గరుగుబెల్లి అనితతో సహా మరో ముగ్గురు మహిళలు విజయనగరంలోని బంధువుల ఇంటిలో జరిగిన వారాల పండగకు బుధవారం ఉదయం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో విజయనగరం నుంచి వస్తున్నప్పుడు గుర్తు తెలియని మహిళ అనిత మెడలో నుంచి గొలుసును చాకచక్యంగా చోరీ చేసింది. అయితే ఈ విషయాన్ని ఆమె పూసపాటిరేగ మండలంలోని కందివలస వచ్చిన తరువాత గమనించింది. వెంటనే 100కు ఫోన్ చేయడంతో జె.ఆర్.పురం పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో రణస్థలంలో బస్సు ఆపి మహిళా పోలీసులు తనిఖీ నిర్వహించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. చోరీకి పాల్పడినట్లు భావిస్తున్న మహిళ కందివలసలో దిగిపోయిందని బస్సులో ఉన్న ప్రయాణికులు తెలిపారు. దీనిపై జె.ఆర్.పురం ఎస్సై రాజేష్ మాట్లాడుతూ.. విజయనగరం, పూసపాటిరేగ సమీపంలో చోరీ జరిగిందని, ఫిర్యాదు స్వీకరించి రెండు పోలీస్‌స్టేషన్లకు సమాచారం ఇచ్చి దర్యాప్తు చేస్తామని చెప్పారు.



బస్సులో తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఆరు పూరిళ్లు దగ్ధం

మెరకముడిదాం: మండలంలోని చినపూతికవలస గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో ఆరు పూరిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామానికి చెందిన కలిగి లక్ష్మునాయుడు, కలిగిఅప్పన్న, సామాదుల శివరాం, కలిగిరమణ, గురాన ఉగాదమ్మ, గురానసూరీడమ్మలకు చెందిన పూరిళ్లు కాలిపోయాయి. ఈప్రమాదంలో బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. తినేందుకు ఉంచుకున్న ధాన్యం, దాచుకున్న డబ్బులు, తదితర వస్తువులు మొత్తం కాలిబూడిదైపోవడంతో బాధితులు రోడ్డున పడ్డారు. తమ గూడు కళ్లముందే కాలిపోతుంటే ఏమీ చేయలేక చూస్తూ భోరున విలపించారు. అయితే ఈఅగ్నిప్రమాదం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల జరిగిందా? పిడుగుపడి జరిగిందా? అన్నది తెలియాల్సి ఉంది. అగ్నిప్రమాదం జరిగిన విషయాన్ని తెలుసుకున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ గిరిధర్ వెంటనే సంఘటనా స్థలాన్ని సందర్శించి బాధితుల నుంచి స్థానికుల నుంచి అగ్నిప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో ఆస్తినష్టం ఎంత జరిగిందో అంచనా వేస్తామని తెలిపారు.

హత్యాయత్నం చేసిన నిందితుడి అరెస్టు

రాజాం సిటీ: ఇటీవల రేగిడి మండలం సంకిలి సుగర్ ఫ్యాక్టరీ వద్ద హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేశామని రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక రూరల్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి ఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ నెల 21న సంకిలి సుగర్ ఫ్యాక్టరీ వద్ద సంకిలి గ్రామానికి చెందిన కర్రి రమణపై పాలకొండకు చెందిన లక్ష్మీనారాయణ కత్తితో దాడిచేసి గాయపరిచాడు. రమణ మెటీరియల్ సప్‌లైర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. పాలకొండకు చెందిన తిరుమల కన్‌స్ట్రక్షన్ సూపర్‌వైజర్‌గా లక్ష్మీనారాయణ పనిచేస్తున్నాడు. తిరుమల కన్‌స్ట్రక్షన్స్ యాజమాన్యం రమణకు రూ.4.70 లక్షలు బకాయి పడింది. దీంతో తన నగదు చెల్లించాలని సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణను రమణ అడగడంతో దాడిచేసి గాయపర్చి పరారయ్యాడు. ఈ క్రమంలో ఎస్సై ఇ.శ్రీనివాస్ సిబ్బంది, పాలకొండ మండలం బూరాడ జంక్షన్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఆర్థిక లావాదేవీలతోనే ఈ ఘటన జరిగిందని సీఐ తెలిపారు. ఈ మేరకు నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామన్నారు. సమావేశంలో ఎస్సై ఇ.శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి

ప్రాంతీయ కార్యాలయం, డోర్ నెం.8-30-19, సాయినగర్, తోటపాలెం, విజయనగరం జిల్లా - 535 002

ప్రజాభిప్రాయ సేకరణ

భారత ప్రభుత్వ పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వశాఖ పర్యావరణ చట్టం 1986 క్రింద విడుదల చేసిన ఇ.ఐ.ఎ. నోటిఫికేషన్ ఎస్.ఒ.నెం.1533, తే.14-09-2006 ది మరియు తదుపరి సర్క్యులర్స్ ప్రకారం మెస్సర్స్ పరమేశ్వరి ఇండస్ట్రీస్, (రోడ్ మెటల్ మరియు బిల్డింగ్ స్టోన్) (1.0 హెక్టార్లు) వారు రూ. 20.0 లక్షలతో సాలీన రోడ్ మెటల్ మరియు బిల్డింగ్ స్టోన్ - 40,903 క్యూబిక్ మీటర్లు త్రవ్వుటకు ప్రతిపాదించిన ప్రాజెక్టును 1.0 హెక్టార్లులో సర్వే నెం. 07, సోంపురం (గ్రామం మరియు పంచాయతీ), వేపాడ మండలం, విజయనగరం జిల్లాలో ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు నిర్వహించుట గురించి ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, విజయనగరం జిల్లా వారు జారీచేయు ప్రకటన.

ప్రాజెక్టు వివరములు క్రింది విధంగా ఉన్నవి :

1.	సంస్థ పేరు మరియు చిరునామా	మెస్సర్స్ పరమేశ్వరి ఇండస్ట్రీస్, (రోడ్ మెటల్ మరియు బిల్డింగ్ స్టోన్) (1.0 హెక్టార్లు) సర్వే నెం. 07, సోంపురం (గ్రామం మరియు పంచాయతీ), వేపాడ మండలం, విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్.
2.	ప్రాజెక్టు స్థలం	సర్వే నెం. 07, సోంపురం (గ్రామం మరియు పంచాయతీ), వేపాడ మండలం, విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్.
3.	అధీకృత వ్యక్తి పేరు, చిరునామా మరియు చరవాణి సంఖ్య	శ్రీ అల్ల శివసతీష్, ప్రొప్రయిటర్, డోర్ నెం. 4-52/2, రాణీ చెరువు దగ్గర, పెందుర్తి, విశాఖపట్నం జిల్లా. ఫోన్ నెం. 9966471111, E-mail: sivasatish2468@gmail.com
4.	ప్రాజెక్టు విలువ	రూ. 20 లక్షలు
5.	ఉత్పత్తి వివరములు	సాలీన రోడ్ మెటల్ మరియు బిల్డింగ్ స్టోన్ - 40,903 క్యూబిక్ మీటర్లు
6.	తేది, సమయం మరియు జరుగుస్థలం	**తేది: 01-07-2023 (శనివారం), సమయం - మధ్యాహ్నం 12.30 గం॥లకు. స్థలం: సోంపురం గ్రామం దగ్గర.**

7. ప్రాజెక్టు కార్యనిర్వాహక సమాచారం, ప్రాజెక్టు పర్యావరణ ప్రభావ అంచనా మరియు కార్యాచరణ ప్రణాళిక నివేదిక మరియు (సాఫ్ట్ కాపీలు) ప్రజలు చూచుటకు అందుబాటులో ఉంచబడిన ప్రదేశములు: 1) జిల్లా కలెక్టరు వారి కార్యాలయం, విజయనగరం. 2) జిల్లా రెవెన్యూ ఆఫీసర్ వారి కార్యాలయం, విజయనగరం. 3) జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయం, విజయనగరం. 4) ముఖ్య కార్యనిర్వాహణాధికారి వారి కార్యాలయం, జిల్లా పరిషత్, విజయనగరం. 5) జిల్లా పరిశ్రమల శాఖ, ఇండస్ట్రీయల్ ఎస్టేట్, విజయనగరం. 6) సభ్యకార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణ భవన్, ఏపీఐఐసీ కాలనీ రోడ్, గురునానక్ కాలనీ, ఆటో నగర్, విజయవాడ- 520007. 7) జోనల్ కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ఉడా లేఅవుట్, మాధవధార, విశాఖపట్నం. 8) డిప్యూటీ డైరెక్టర్ (యస్), పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వ శాఖ కార్యాలయం మరియు క్లైమేట్ ఛేంజ్, భారత ప్రభుత్వం, సమీకృత ప్రాంతీయ కార్యాలయం, గ్రీన్ హౌస్ కాంప్లెక్స్, గోపాలరెడ్డి రోడ్, విజయవాడ-520010, ఆంధ్రప్రదేశ్. 9) స్టేట్ లెవల్ ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ అథారిటీ (ఎస్.ఇ.ఐ.ఎ.ఎ.) వారి కార్యాలయం, డోర్ నెం. 33-26-14డి/2, సన్‌రైజ్ హాస్పిటల్ దరి, పుష్ప హోటల్ సెంటర్, చలమవారివీధి, కస్తూరిభాయి పేట, విజయవాడ -520010. 10) జిల్లా గనులు మరియు భూగర్భశాఖ ఆఫీసర్ వారి కార్యాలయం, విజయనగరం. 11) తహశీల్దార్ కార్యాలయం, వేపాడ మండలం, విజయనగరం. 12) గ్రామ పంచాయితీ కార్యాలయం, సోంపురం (గ్రామం మరియు పంచాయతీ), వేపాడ మండలం, విజయనగరం. 13) ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, డోర్‌నెం. 8-30-19, సాయినగర్, తోటపాలెం, విజయనగరం జిల్లా.

పై తెలియజేసిన ప్రాజెక్టుకు సంబంధించి ఏమైనా సూచనలు, సలహాలు, అభిప్రాయాలు మరియు అభ్యంతరములు ఉన్న యెడల **తే: 01.07.2023** దిన గాని, దానికి ముందుగా గాని ఈ క్రింది సంతకము చేసిన అధికారి వారికి లిఖిత పూర్వకముగా పంపించవచ్చును. మరియు పైన సూచించిన తేది మరియు ప్రదేశము వద్ద ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులో పాల్గొని గానీ తెలియజేయవచ్చు.

సం/- (పర్యావరణ ఇంజనీర్)
ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి,
ప్రాంతీయ కార్యాలయం, విజయనగరం.

స్థలం : విజయనగరం.
తేది : 25-05-2023

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి

ప్రాంతీయ కార్యాలయం, డోర్ నెం.8-30-19, సాయినగర్, తోటపాలెం, విజయనగరం జిల్లా - 535 002

ప్రజాభిప్రాయ సేకరణ

భారత ప్రభుత్వ పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వశాఖ పర్యావరణ చట్టం 1986 క్రింద విడుదల చేసిన ఇ.ఐ.ఎ. నోటిఫికేషన్ ఎస్.ఒ.నెం.1533, తే.14-09-2006 ది మరియు తదుపరి సర్క్యులర్స్ ప్రకారం మెస్సర్స్ పరమేశ్వరి ఇండస్ట్రీస్, (రోడ్ మెటల్ మరియు బిల్డింగ్ స్టోన్) (0.5 హెక్టార్లు) వారు రూ. 15.0 లక్షలతో సాలీన రోడ్ మెటల్ మరియు బిల్డింగ్ స్టోన్ - 19,370 క్యూబిక్ మీటర్లు త్రవ్వుటకు ప్రతిపాదించిన ప్రాజెక్టును 0.5 హెక్టార్లులో సర్వే నెం. 07, సోంపురం (గ్రామం మరియు పంచాయతీ), వేపాడ మండలం, విజయనగరం జిల్లాలో ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు నిర్వహించుట గురించి ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, విజయనగరం జిల్లా వారు జారీచేయు ప్రకటన.

ప్రాజెక్టు వివరములు క్రింది విధంగా ఉన్నవి :

1.	సంస్థ పేరు మరియు చిరునామా	మెస్సర్స్ పరమేశ్వరి ఇండస్ట్రీస్, (రోడ్ మెటల్ మరియు బిల్డింగ్ స్టోన్) (0.5 హెక్టార్లు) సర్వే నెం. 07, సోంపురం (గ్రామం మరియు పంచాయతీ), వేపాడ మండలం, విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్.
2.	ప్రాజెక్టు స్థలం	సర్వే నెం. 07, సోంపురం (గ్రామం మరియు పంచాయతీ), వేపాడ మండలం, విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్.
3.	అధీకృత వ్యక్తి పేరు, చిరునామా మరియు చరవాణి సంఖ్య	శ్రీ అల్ల శివసతీష్, ప్రొప్రయిటర్, డోర్ నెం. 4-52/2, రాణీ చెరువు దగ్గర, పెందుర్తి, విశాఖపట్నం జిల్లా. ఫోన్ నెం. 9966471111, E-mail: sivasatish2468@gmail.com
4.	ప్రాజెక్టు విలువ	రూ. 15 లక్షలు
5.	ఉత్పత్తి వివరములు	సాలీన రోడ్ మెటల్ మరియు బిల్డింగ్ స్టోన్ - 19,370 క్యూబిక్ మీటర్లు
6.	తేది, సమయం మరియు జరుగుస్థలం	**తేది: 01-07-2023 (శనివారం), సమయం - ఉదయం 10.30 గం॥లకు. స్థలం: సోంపురం గ్రామం దగ్గర.**

7. ప్రాజెక్టు కార్యనిర్వాహక సమాచారం, ప్రాజెక్టు పర్యావరణ ప్రభావ అంచనా మరియు కార్యాచరణ ప్రణాళిక నివేదిక మరియు (సాఫ్ట్ కాపీలు) ప్రజలు చూచుటకు అందుబాటులో ఉంచబడిన ప్రదేశములు: 1) జిల్లా కలెక్టరు వారి కార్యాలయం, విజయనగరం. 2) జిల్లా రెవెన్యూ ఆఫీసర్ వారి కార్యాలయం, విజయనగరం. 3) జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయం, విజయనగరం. 4) ముఖ్య కార్యనిర్వాహణాధికారి వారి కార్యాలయం, జిల్లా పరిషత్, విజయనగరం. 5) జిల్లా పరిశ్రమల శాఖ, ఇండస్ట్రీయల్ ఎస్టేట్, విజయనగరం. 6) సభ్యకార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణ భవన్, ఏపీఐఐసీ కాలనీ రోడ్, గురునానక్ కాలనీ, ఆటో నగర్, విజయవాడ- 520007. 7) జోనల్ కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ఉడా లేఅవుట్, మాధవధార, విశాఖపట్నం. 8) డిప్యూటీ డైరెక్టర్ (యస్), పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వ శాఖ కార్యాలయం మరియు క్లైమేట్ ఛేంజ్, భారత ప్రభుత్వం, సమీకృత ప్రాంతీయ కార్యాలయం, గ్రీన్ హౌస్ కాంప్లెక్స్, గోపాలరెడ్డి రోడ్, విజయవాడ-520010, ఆంధ్రప్రదేశ్. 9) స్టేట్ లెవల్ ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ అథారిటీ (ఎస్.ఇ.ఐ.ఎ.ఎ.) వారి కార్యాలయం, డోర్ నెం. 33-26-14డి/2, సన్‌రైజ్ హాస్పిటల్ దరి, పుష్ప హోటల్ సెంటర్, చలమవారివీధి, కస్తూరిభాయి పేట, విజయవాడ -520010. 10) జిల్లా గనులు మరియు భూగర్భశాఖ ఆఫీసర్ వారి కార్యాలయం, విజయనగరం. 11) తహశీల్దార్ కార్యాలయం, వేపాడ మండలం, విజయనగరం. 12) గ్రామ పంచాయితీ కార్యాలయం, సోంపురం (గ్రామం మరియు పంచాయతీ), వేపాడ మండలం, విజయనగరం. 13) ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, డోర్‌నెం. 8-30-19, సాయినగర్, తోటపాలెం, విజయనగరం జిల్లా.

పై తెలియజేసిన ప్రాజెక్టుకు సంబంధించి ఏమైనా సూచనలు, సలహాలు, అభిప్రాయాలు మరియు అభ్యంతరములు ఉన్న యెడల **తే: 01.07.2023** దిన గాని, దానికి ముందుగా గాని ఈ క్రింది సంతకము చేసిన అధికారి వారికి లిఖిత పూర్వకముగా పంపించవచ్చును. మరియు పైన సూచించిన తేది మరియు ప్రదేశము వద్ద ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులో పాల్గొని గానీ తెలియజేయవచ్చు.

సం/- (పర్యావరణ ఇంజనీర్)
ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి,
ప్రాంతీయ కార్యాలయం, విజయనగరం.

స్థలం : విజయనగరం.
తేది : 25-05-2023

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు(100 గుడ్లు)
విశాఖపట్నం రూ. 480.00
విజయనగరం రూ. 485.00
శ్రీకాకుళం రూ. 485.00

బులియన్

విశాఖపట్నం
బంగారం(24సి. 10గ్రా.) 56,000-00
బంగారం(22సి. 10గ్రా.) 61,100-00
వెండి (కిలో)78,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹145	₹260	₹270